31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

బుధవారం 11 మార్చి 2026 | పేజీలు : 8

## ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరు కావాలి

- జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 10 :** విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరు కావాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల జిల్లాలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను రాయబోయే విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పలు సూచనలు, సలహాలు తెలిపి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జూమ్ మీటింగ్ ద్వారా విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. పరీక్షలకు ముందు సరైన పద్ధతిలో పునశ్చరణ చేసుకోవాలని, సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. ప్రశ్న పత్రాన్ని జాగ్రత్తగా చదివి సమాధానాలను స్పష్టంగా, క్రమబద్ధంగా రాయాలని, పరీక్ష సమయంలో ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ఆత్మస్థైర్యంతో పరీక్ష రాయాలని విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాదిలాంటిదని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

# హుజూరాబాద్ అభివృద్ధికి కృషి






రవాణా, బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్

**చురకలు ప్రతినిధి, హుజూరాబాద్, మార్చి 10 :** హుజూరాబాద్ పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్ నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తోందని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడుతోందని రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన రొంటాల బాధ్యతల స్వీకరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. అంతకుముందు పట్టణంలకో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ నాయకత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అయన ప్రసంగించారు. హుజురాబాద్ మున్సిపల్ పరిధిలో ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో -2లో



## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

- 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు
- 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలు ‘తెలంగాణ బ్రాండ్’ ప్రతిబింబించేలా ప్రతిష్ఠాత్మక ఏర్పాట్లు
- కేబినేట్ సబ్ కమిటీ తొలి సమావేశంలో మంత్రులు

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ మార్చి 10 :** కుంభమేళా తరహాలోనే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ‘గోదావరి పుష్కరాలు 2027’ క్యాబినేట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. ‘తెలంగాణ బ్రాండ్’ మార్మోగేలా... మన సంస్కృతి, -2లో

## తెలంగాణ వైభవం చాటేలా గోదావరి పుష్కరాలు నిర్వహించాలి

-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి



**చురకలు, విలేఖరి,వెల్గటూర్ మార్చి 10 :** తెలంగాణ రాష్ట్రంలో రానున్న గోదావరి పుష్కరాలు తెలంగాణ రాష్ట్ర సంస్కృతి వైభవాన్ని చాటి చెప్పే విదంగా ఘనంగా నిర్వహించాలని రాష్ట్రసాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం సెక్రటేరియట్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన గోదావరి పుష్కరాలు--2027 కేబినెట్ సబ్ కమిటీ తొలి సమా వేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి పుష్కరాలను కనివిని ఎరుగని రీతిలోజరిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రతిష్టాత్మాకంగా పుష్కరాల ఏర్పాట్లు అత్యంత ప్రాముఖ్యంతో చేపట్టాల్సిన అవసరం ఉంద న్నారు. గోదావరినది పరివాహక ప్రాంతాల్లో లక్షలాది మంది భక్తు లు పుష్కర స్నానాలకు తరలి వస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా ధర్మపురి నియోజకవర్గ పరిధిలో గోదావరి తీ రం విస్తరించి ఉండటంతో పాటు అక్కడ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉం డటం భక్తుల రద్దీ మరింత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం సహా గోదావరి తీరం వెంట కోటిలింగా ల శ్రీ పార్వతి కోటేశ్వరస్వామి ఆలయాలను దర్శించేందుకు దేశం -2లో

## తుమ్మడి హట్టి బ్యారేజ్ నిర్మాణానికి నిధులు కేటాయించాలి

- మేడిగడ్డ బ్యారేజిని పునరుద్ధరించాలి
- తుమ్మడిహెట్టి కాంగ్రెస్ పార్టీ డ్రీమ్ ప్రాజెక్ట్
- తాగు, సాగు నీటితో పాటు, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగం
- బడ్జెట్‌లో రెండేళ్లలో 10,000 కోట్ల నిధులు కేటాయించాలి

మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 10 :** తుమ్మడి హేట్టి బ్యారేజ్ నిర్మాణానికి నిధులు కేటాయిం చాలని, మేడిగడ్డ బ్యారేజిని పునరుద్ధరించాలని, తుమ్మడిహెట్టి కాంగ్రెస్ పార్టీ డ్రీమ్ ప్రాజెక్ట్ అని, త్రాగు, సాగు నీటితో పాటు, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగం పడుతుందని, రెండేళ్లలో 10,000 కోట్ల నిధులు కేటాయించాలని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి -2లో



## సంప్రదాయరీతిలో ఉగ్రనారసింహ పుష్పయాగం

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
బ్రహ్మోత్సవాలలో అంతర్భాగంగా మంగళ వారం రాత్రి కోరిన కోర్కెలు తీర్చే దైవమైన ఉగ్ర నారసింహుని పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థం, భక్తజన కోరికల సాఫల్యార్థం నిర్వహించిన పుష్పయాగం దేవస్థాన పౌరోహితులు పురుషోత్తమాచార్య, వేదవిదులు రమేశ శర్మల ఆచార్వత్యంలో అర్చకులు వంశీ, అరుణ్, నరసింహమూర్తి తదితరులు జరిపించారు. ఆలయ మంటపంలో పంచాబ్జమును చిత్రించి, పుష్ప పీఠాసీనుల జేసి, నలువైపులా ద్వార కుంభాల నుంచి వాసుదేవ పుణ్యాహ వాచనం, షోడశాక్షరీ మంత్ర పఠనం గావించి, చరుర్వేదాలతో, సంగీతాది కళలతో ఉగ్రనా రసింహుని సేవించగా భక్తిశ్రద్ధలతో కొలిచారు.

**వేంకటేశ్వర ఏకాంతోత్సవ వేడుకలు**
మంగళ వారం రాత్రి దేవస్థానంలో నిర్వహించిన శ్రీవేంకటేశ్వర స్వామి ఏకాంతోత్సవ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా దేవస్థానం లోని ప్రధానాలయమైన వేంకటేశ్వరుని దేవాలయంలో, సనాతన సాంప్రదాయ ఆచారం క్రమంలో రాత్రి 9.00 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి దాటే వరకు కొనసాగిన ఏకాంతోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో ముందుగా ఏడు కొండల పెన్నిధి మూల విరాట్టును సర్వాంగ సుందరంగా, బిలోలికి చెందిన భక్తులు శంకర్ అరుగులవార్ సహకారంతో, దాతృత్వంతో, అర్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్య, మోహనాచార్య, విజయ్, కిరణ్ లు ప్రత్యేకంగా మున్నెన్నడూ లేని విధంగా, పుష్పాలంకృతుల గావించి, విశేష ఉత్సవాలంకారాలతో తీర్చి దిద్దారు.వేద, శాస్త్ర, పురాణ, సంగీత, నృత్య, వాద్య, మౌనాది సాంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించారు.ప్రదక్షిణలు చేశారు. దేవస్థాన యాజ్ఞికులు పురుషోత్తమా చార్య, ఆస్థాన వేదపండితులు బొజ్జా రమేశ శర్మ, ఆలయ అర్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్య, విజయ్, మోహన్, కిరణ్, దేవస్థానం ఈఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తల మండలి మార్గదర్శకత్వంలో, పాంచరాత్ర ఆగమ విధిన వైష్ణవ వేదోక్త సాంప్రదాయ కార్యక్రమాలు జరిపారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏకాంత స్థలంలో ఊయలలో అలమేలు మంగా పద్మావతీ దేవి సహిత స్వామిని పవళింపు జేసి, సంగీతజ్ఞుల పాటల మధ్య, భక్తజన సమక్షంలో ఏకాంత వేడుకలను నిర్వహించారు. కైమోడ్పులిడిన అశేష భక్తులు కన్నులారా అపురూప సన్నివేశాన్ని గాంచి అలౌకికానంద భరితులై తరించారు. వేడుకలలో భాగస్వాములైన భక్తులకు ప్రసాదాలు అందజేశారు. దేవస్థానం పక్షాన వేదపండిత సత్కారం చేశారు.



# హుజురాబాద్ అభివృద్ధికి కృషి

**మొదటి పేజీ తరువాయి.....** ఓట్లు వేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని అన్నారు. ఇక్కడికి వచ్చే ముందే సి ఎం రేవంత్ రెడ్డితో మాట్లాడానని, హుజురాబాద్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారని తెలిపారు. రాజకీయాలు ఏవైనా ఉంటె ఎన్నికలవరకే అని తదనం తరం అభివృద్ధిపై దృష్టి .పెట్టామని స్పష్టం చేసారు. మార్చి 6 నుండి జూన్ 12 వరకు వందరోజుల ప్రణాళిక నిర్వహిస్తున్నామని, పరిసర పరిశుభ్రత, ఈ వ్యర్థాల సేకరణ, ప్లాస్టిక్ రహిత సమాజం, మొక్కలు నాటడం, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ అంశాలపై దృష్టి పెట్టాలని అయన అధికారులను కోరారు. యువత గంజాయి డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు అరైవ్, అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని, క్రీడోత్సవాలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బ్యాంకుల నిర్వహణ మహిళాసంఘాలకు అప్పగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అంబేద్కర్ భవనం పూర్తి చేయండి...**
హుజురాబాద్ పట్టణంలో బస్టాండ్ వద్ద అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ భవనం సుదీర్ఘ కాలంగా పెండింగ్లో ఉందని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నేత తునికి సమ్మయ్య మంత్రి పొన్నం ప్రభాకర్ ను కోరగా సానుకూలంగా స్పందించారు.

# కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

**మొదటి పేజీ తరువాయి....**
సంప్రదాయాలను ప్రతి బింబించేలా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. మంగళవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కమిటీ తొలి సమావేశంలో... సభ్యులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కర నిర్వహణ తేదీలు, సంబంధిత శాఖల సన్నద్ధత, భవిష్యత్తు కార్యాచరణను సమీక్షించి... అధికారుల కు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లా డుతూ.... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వం లోని ప్రజా ప్రభుత్వం సరస్వతీ పుష్కరా లు, సమ్మక్క సారక్క జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించిందన్నారు. అదే స్ఫూర్తితో... మరింత రెట్టించిన ఉత్సాహంతో రాబోయే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు, 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలను నిర్వహించాలని వేద పండితులు నిర్ణయించారన్నారు. సుమారు 8 కోట్ల మంది భక్తులు ఈ పుష్కరాలకు తరలి వచ్చే అవకాశముందని, అందుకు అనుగుణంగానే గోదావరి ప్రవహించే జిల్లాల్లో... ప్రముఖ దేవాలయాలను అనుసంధానిస్తూ... 96 ప్రాంతాలను పుష్కరాల కోసం ప్రత్యేకంగా ఎంపిక చేశామన్నారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆయా చోట్ల క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగు ణంగా ఘాట్లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర, జిల్లా ప్రణాళికలను ప్రత్యేకంగా రూపొందిస్తు న్నామన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వీలైనంత వేగంగా పనుల్ని ప్రారంభించేలా ముమ్మర కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ నెల చివరి నాటికి డీపీఆర్ లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా మన్నారు. తొలి దశలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు రద్దీ అధికంగా ఉండే తొమ్మిది ప్రాంతాలను 'టైర్ -- 1' కింద ఎంపిక చేశామన్నారు. సమన్వయలోపం తలెత్తకుండా గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్, శాఖల వారీగా నోడల్ అధికారులను నియమిస్తామన్నారు. ప్రతి ఘాట్ దగ్గర ట్రాఫిక్ క్రమబ ద్దీకరణ, ఎమర్జెన్సీ రూట్, అత్యాధునిక వైద్య సౌకర్యాలు, పార్కింగ్ తదితర అం శాలపై ప్రధానంగా దృష్టి సారించా మన్నారు. పుష్కర ఏర్పాట్లలో రాజీపడే ప్రసక్తే లేదని, పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అత్యంత పకడ్బందీగా వ్యవహరించాలని అధికారు లను ఆదేశించారు.

# తుమ్మడి హట్టి బ్యారేజ్ నిర్మాణానికి...

**మొదటి పేజీ తరువాయి.....**
అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ సస్య శ్యామలం చెందేందుకు గోదావరి దిగువన వృధాగా పోతున్న నీటిని ఉపయోగించుకునేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి కృషి చేశారని, ప్రాణహిత నది నీటి హక్కును వినియోగించుకునేందుకు తుమ్మడి హేటి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టేందుకు కాలువలు కూడా నిర్మించారన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి కి కూడా త్రాగునీరు, పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకునేందుకు ఎంతో అవసరమని, తుమ్మడి హేటి వద్ద టెండర్ దశలోనే నిలిచిపోయిందన్నారు. 2023 అక్టోబర్ లో 7వ బ్లాక్ వద్ద కుంగి పోవటంతో నీటిని తరలించే అవకాశం లేకుండా పోయిందని, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల కు మరమ్మతులు చె పట్టాలని జాతీయ డ్యామ్ సేఫ్టీ సంస్థ సూచించిందని, రాష్ట్ర ప్రభుత్వమే మరమ్మత్తులు చేపట్టి కాంట్రాక్టర్ వద్ద రికవరీ చేయవచ్చని, అవసరమైతే క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టవచ్చన్నారు. తుమ్మడిహెట్టి బ్యారేజ్ నిర్మాణం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో కూడా చేర్చిందని, తుమ్మడి హేట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపడుతామని రాహుల్ గాంధీ చెప్పారని గుర్తు చేశారు. 152 మీటర్ల నీటిని తరలించేందుకు తవ్విన కాలువలు 148 మీటర్ల నీటిని తరలించేందుకు రీ డిజైన్ చేయవచ్చన్నారు. జైపూర్ వాగు నుండి సుందిల్ల లిఫ్ట్ తో ఎల్లంపల్లి కి నీటిని తరలించవచ్చని, తుమ్మడి హేట్టి బ్యారేజ్ నిర్మాణం, నీటి తరలింపు, కాలువల రీ డిజైన్ కు పదివేల కోట్లకు మించదని, ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు మూసీ నది ప్రక్షాళనకు, హైదరాబాద్ వరంగల్, మెదక్, నల్గొండ సగం రాష్ట్రానికి ప్రాణహిత నది జలాలను వినియోగించుకోవచ్చన్నారు. రాష్ట్రానికి గోదావరి, ప్రాణహిత నది జలాలు ఆయువుపట్టు అని, రెండేళ్లుగా ప్రకృతి సహకరించిందని, వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే రాష్ట్రం త్రాగు నీరు, సాగు నీరు కు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. మేడిగడ్డ పునరుద్ధరణ, నిర్మాణ వైఫల్యమా.. నిర్వహణ లోపమా..ఏదైనా.. మేడిగడ్డ పునరుద్ధరణ చేసి, వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని, తుమ్మడి హేట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టేందుకు ప్రాధాన్యతతో నిధులు కె టాయించాలని, ఆరు నెలల పాటు సుమారు 180 టీఎంసిల నీటిని తరలించుకోవచ్చని, ఒక్క లిఫ్టితో ఎల్లంపల్లికి నీటిని తరలించే అవకాశం ఉందని, తుమ్మడి హేట్టి బ్యారేజ్ నిర్మాణానికి రెండేళ్లు 5000 కోట్లు చొప్పున కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లకు విజ్ఞప్తి చేశారు. గత పదేళ్ల నుండి బాధ్యత గల ఎ కారుడిగా తుమ్మడి హేట్టి ప్రాధాన్యతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని గుర్తు చేశారు.


## తెలంగాణ వైభవం చాటేలా గోదావరి పుష్కరాలు నిర్వహించాలి

**మొదటి పేజీ తరువాయి....** నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని,అందువల్ల ఘాట్ల అభివృద్ధి, తాత్కాలిక స్నాన ఘాట్లు, రహదారుల విస్తరణ, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, భద్రత వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పుష్కరాల సమయంలో భక్తులకు సౌకర్యవంతమైన రవాణా కోసం ప్రత్యేక బస్సులు, తాత్కాలిక వసతికేంద్రాలు, సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే విపత్తు నిర్వహణ, పోలీసు భద్రత, వైద్య అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు.ఇటీవల సమ్మక్క సారలమ్మ జాతరను ఎలాగైతే విజవంతం చేశామో అదేవిదం గా మరింత వైభవంగా గోదావరి పుష్కరాలను నిర్వహించాలని,ఈ సందర్భంగా గోదావరి పరివాహక ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసి దేశం నలుమూలాల నుండి పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పేలా కార్యచరణ చేపట్టాలని మంత్రి అడ్లూరి సూచించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క పాల్గొన్నారు.

# కలియుగ దైవానికి ప్రత్యేక పూజలు

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

ప్రాచీన పుణ్యక్షేత్రమైన ధర్మపురి దేవస్థానంలోని ప్రధానాలయమైన శ్రీవేంకటేశ్వర ఆలయంలో మంగళ వారం స్వామివారిఏకాంతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్షీరోద సంభవాం...పాల సముద్రంలో జన్మించిన లక్ష్మీదేవి ప్రీతిపాత్రుడై క్షీరాబ్ధిపై శయనించిన వైకుంఠ వాసునికి లక్ష్మీదేవి జన్మస్థానమైన క్షీరమంటే అత్యంత ఇష్టము. అందుకే మహావిష్ణువు క్షీరాభిషేకానికి సంతుష్టుడై, సకల కోర్కెలు నెర వేరుస్తాడని ప్రతీతి. “కృతేతు నార సింహాత్ త్రేతాయం రఘునందన..,ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకట నాయకః”కృతయుగంలో శ్రీనృసింహునిగా,త్రేతా యుగంలో శ్రీరామునిగా,ద్వాపర యుగంలో శ్రీకృష్ణునిగా,కలి యుగంలో శ్రీవేంకట నాయ కునిగా అవతరించాడు శ్రీమహా విష్ణువు.శ్రీయాధ్య స్థితవక్షసం...లక్ష్మీదేవి నివాస స్థానమైనవక్షము గల శ్రీవేంకటేశ్వరునికి,క్షీరాభిషేకం సర్వ శ్రేష్టం అలాగే స్వామివారికి ప్రీతి పాత్రము.తనకిష్టమైన దానిని సమర్పిం చే వారికి ఇష్టమైనవి ఇచ్చే వరదుడు అయిన శ్రీవేంకటేశ్వరుని ఏకాంతోత్సవ సందర్భంగా నిర్వహించే క్షీరాభిషేకం విశేష ప్రాధాన్యతను సంతరించుకున్నది. శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన అనుబంధ వేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాల అంతర్భాగంగా మంగళ



వారం నిర్వహించిన స్వామి ఏకాంతోత్స వ సందర్భంగా మును ముందుగా దేవాలయాన్ని,అర్చకులు సకల పాప పరిహారార్థం సంప్రోక్ష కార్యక్రమాలు లక్ష్మీ హవనాది పూజలొ నరించారు. అనంతరం ఉప ప్రధానార్చకులు శ్రీనివాసాచార్య,కిరణ్,మోహనాచార్య విజయ్ అర్చకులు,భక్తజన సమక్షంలో వేంకటేశ్వరుని మూల విరాట్టును ముందుగా పాలతో అభిషేకించి, సర్వాంగ సుందరంగా అలంకరించి, ప్రత్యేక అర్చనలుగావించారు. అనంతరం ఏక,త్రయ,పంచమ,సప్త, సర్ప,నక్షత్ర,వృక్ష,కుంభాది హారతులు, మంత్రపుష్ప,అవధారయ,ఆశీర్వచనాది కార్యక్రమాలను నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజాదికాల లో భాగస్వాము లైనారు.దేవస్థానం ఈఓ శ్రీనివాస్,జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తల మండలి, సిబ్బంది సౌకర్యాలను పర్యవే క్షించగా, భక్తులు పాల్గొన్నారు.

**క్షేత్రంలో అంబరాన్ని స్పృశించిన భక్తి పారవశ్యం**

పవిత్ర గోదావరి నదీ తీరస్థ పుణ్య తీర్థమైన ధర్మపురి క్షేత్రం మంగళ వారం భక్తి పారశ్యంతో పొంగి పోయింది.క్షేత్రంలో నిర్వహి స్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన కోరిన కోర్కెలుతీర్చే వరదుడైన శ్రీవేంకటేశ్వరుని ఏకాంతోత్సవ వేడుకలలో పాల్గొన్న, దీక్షలు స్వీకరించిన హన్మాన్ భక్తుల రాకతో క్షేత్రం భక్త,యాత్రిక జనంతో నిండి పోయింది.సుదూర ప్రాంతాల నుండి సనాతన వారసత్వ సాంప్ర దాయాచరణలో భాగంగా విచ్చేసిన భక్త, యాత్రిక జనం భగవన్నామ స్మరణలతో, జయ జయ ధ్వనాలతో క్షేత్రం ప్రతిధ్వ నించింది. వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజాదికాలలో అధిక సంఖ్యాకులైన భక్తులు పాల్గొన్నారు. ముఖ్యంగా అర్ధ మండల దీక్షాపరులైన హన్మాన్ భక్తుల భక్తి పారవశ్యం ఆవధులు దాటి అలౌకిక ఆనందాన్ని ఆస్వా దింప జేసింది.ఉదయాత్పూర్వం నుండే దూర ప్రాంతాలనుండి ప్రయివేటు వాహనాలు,బస్సులలో క్షేత్రానికి చేరుకున్న భక్తులు, పవిత్ర గోదావరిలో మంగళ స్నానాలు ఆచరించి, ప్రధానాలయాల ముందు బారులు తీరి వేచి ఉండి దైవ దర్శనాలు చేసు కున్నారు. విశేషించి దేవస్థానం లోని ప్రసన్నాంజనేయ మందిర ప్రాంగణాన నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఒద్దిపర్తి నర్సింహామూర్తి ఆధ్వర్యంలో హన్మాన్ భక్తులు మాల ధారణం, మంత్రోపదేశం పొందారు.

**ఆంజనేయ సన్నిధిలోభక్తజనం**

దీక్షాపరులైన భక్తులతో ఆంజనేయ ఆలయం కిటకిటలాడింది. ఇటీవలి కాలంలో ధర్మపురి క్షేత్రస్థ దేవస్థానం లో సాంప్రదాయ రీతిలో హన్మాన్ దీక్షలను స్వీకరిస్తున్న నేపథ్యంలో, చైత్ర పౌర్ణమి హన్మాన్ జయంతిని పురస్క రించుకుని, 21రోజుల పాటు ఆచరించే దీక్షలలో భాగంగా, మంగళ వారం పెద్ద సంఖ్యలో ప్రత్యేక హన్మాన్ అర్ధ మండల దీక్షలను స్వీకరించేందుకై అరుదెంచి, పవిత్ర గోదావరి నదిలో మంగళ స్నానాలను ఆచరించి, పునీతులై, శ్రీలక్ష్మీ నరసింహ దేవ స్థానాంతర్గత ప్రసన్నాంజనేయ ఆలయం ముందు దైవదర్శనార్థం బారులుతీరి వేచి ఉన్నారు. దేవ స్థానం ఎసి, ఈఓ శ్రీనివాస్, చైర్మన్ రవీందర్, ధర్మ కర్తలు, ఆస్థాన వేదపండితులు బొజ్జా రమేశ శర్మ, ఆలయ అర్చకులు వొద్దిపర్తి నర్సింహామూర్తి, కళ్యాణ్ ఆధ్వర్యంలో అంజనీ తనయునికి ప్రత్యేక అభిషేకాలు, నిత్యవిధి పూజలు, అర్చనలు నిర్వహించారు.

# జగ్గసాగర్ పీహెచ్‌సీలో మెగా హెల్త్ క్యాంప్

**- ప్రజలకు ఉచిత వైద్య సేవలు**

**-ప్రజల ఆరోగ్యం కోసం మెగా హెల్త్ క్యాంప్ జగ్గసాగర్ పీహెచ్‌సీలో సందడి**

**చురకలు విలేఖరి మెట్పల్లి, మార్చి (10) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం మండలంలోని జగ్గసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు.ఈ కార్యక్ర మానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు హాజరై మెగా హెల్త్ క్యాంప్ నిర్వహణను విజయవంతం చేసిన వైద్య సిబ్బంది మరియు నిర్వాహకులను అభినందించారు. అనంతరం పలువురు నాయకులు కృష్ణారావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రభుత్వ వైద్యులు డా. అమరేశ్వర్, మెడికల్



ఆఫీసర్ డా. ఆంజిత్ రెడ్డి,డా. బిజ్జరాపు శ్రీనివాస్, సర్పంచ్ పుల్ల సాయి గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు ఇల్లేందుల రాజు, నాయకులు పాలేపు నీల, అల్లూరి మహేందర్ రెడ్డి, అజార్, పుప్పాల గంగాధర్, భూమేష్, జెడ్డి రవి, కంబ సురేష్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వెల్గటూర్‌లో ఘనంగా రేణుక ఎల్లమ్మ కొలుపు ఉత్సవాలు

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, మార్చి 10 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో కులదేవత రేణుక ఎల్లమ్మ కొలుపు ఉత్సవాలు 5 రోజులపాటు ఘనం గానిర్వహించారు.మంగళవారం చివరిరోజు ఉదయం ఎల్లమ్మ బోనాలతో మహిళలు గ్రామ అంబేద్కర్ చౌక్ నుండి రేణుక ఎల్లమ్మ ఆలయం వరకు డప్పు చప్పుళ్ల తో పంబాల వారి వాయిద్య నృత్యాలతో ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మకు బోనాలు సమర్పించుకొని



మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రేణుక ఎల్లమ్మ కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. గౌడ కులస్థులు వారివారి ఇండ్లల్లో బంధుమిత్రులతో రేణుక ఎల్లమ్మ కొలుపు ఉత్సవాల ముగింపు సందర్భంగా విందుల్లోపాల్గొని ఉత్సాహంగా పండుగ జరుపు కున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులతోపాటు గౌడ కుల బాందవులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## రైతులు విధిగా గాలికుంటూ వ్యాధి టీకాలు వేయించుకోవాలి



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం మార్చి (10) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట గ్రామంలోమండల పశు వైద్యాధికారి ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటూ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంను స్థానిక సర్పంచ్ కాశిరెడ్డి భాస్కర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతు రైతులు పశువైద్యుల సూచనలు,సలహాలు తప్పకుండ పాటించాలని అన్నారు. అలాగే మండల పశువైద్యాధికారి డాక్టర్ వి.శైలజ మాట్లాడుతూ రైతులు విధిగా గాలి కుంటూ వ్యాధి టీకాలు ప్రతి ఆరు మసాలాకొకసారి టీకాలు వేయడం జరుగుతుంది అని ఈ వ్యాధి వాళ్ళ పాడి రైతులకు కలిగే ఇబ్బందులను రైతులకు వివరంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది జమున,తేజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మాక్ పార్లమెంట్ నిర్వహణ కార్యక్రమం




**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (10) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు రాజన్న ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం నేతృత్వంలో విద్యార్థులతో మాక్‌పార్లమెంట్ నిర్వహణకార్యక్రమం నిర్వహించారు. విధ్యర్ధులచే స్పీకర్,వివిధ శాఖల మంత్రుల వలె, పార్లమెంట్ సభ్యుల వలె అధికారపక్షం,ప్రతిపక్షంలాగా వ్యవహరించి వివిధ రకాల చట్టాలు, బిల్లులు పార్లమెంటు సమావేశాలలో ఏవిధంగా అమలులోకి వస్తాయో తోటి విద్యార్థుల కు, చూపరులకు ప్రత్యక్ష అనుభూతిని కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న మాట్లాడుతూ మన దేశం గొప్ప ప్రజాస్వామ్య దేశమని ప్రజాస్వామ్య విలువల్ని కాపాడాల్సిన బాధ్యత భావిభారత పౌరులైన పిల్లలపైన ఉందన్నారు.ఈకార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో విద్యుత్ ఉద్యోగుల నిరసన




**చురకలు విలేకరి,జగిత్యాల,మార్చి 10 :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న ఎలక్ట్రిసిటి అమెండ్మెంట్ బిల్ 2025కు వ్యతిరేకంగా మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో టిజిపిఈజెఎసి ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణతో ప్రస్తుతం ఉన్న ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని, రానున్న రోజుల్లో నిరుద్యోగులకు ఉద్యోగులు వచ్చే అవకాశం ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడిలను క్రమ క్రమంగా ఎత్తి వేయాల్సి వస్తుందని, విద్యుత్ చార్జీలను ప్రతి ఏడాది ఏప్రిల్ లో పెరుగుతాయన్నారు.విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేసే వరకు తాము పోరాటం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ సుదర్శనం,డిఈలు గంగారాం ,మధుసూదన్,గోపికృష్ణ,ఎస్ఏఓ శ్రీనివాస్, జెఎసి నాయకులు ప్రసాద్,రాంజీ నాయక్,వరుణ్ కుమార్,జవహర్ నాయక్,సతీష్,ప్రవీన్,ఆంజనేయులు, రహీమ్, అశోక్ రెడ్డి,అబీద్,భూమయ్య,అజీజ్,ఉద్యోగులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా పేదల సంక్షేమం

**-కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (10) :** కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా పెదలసంక్షేమం అని కోరుట్ల కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు.జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం లో మంగళవారం ముఖ్యమంత్రి సహాయక నిధి ద్వారా మంజూరు అయిన 22 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 10 లక్షల 60వేల రూపాయలు చెక్కులను కోరుట్ల కాంగ్రెస్ పార్టి ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో బాగాంగ ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా పేదలు, అసహాయులు,వైద్య అవసరాలు, విద్య, వ్యాపారాలు మొదలైన రంగాల్లో ఉన్న ప్రజలకు తక్షణ సహాయం అందించడం జరుగుతోందన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోడిగం రాజు,వైస్ చైర్మన్ ఎల్లాల వెంకట్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి,సర్పంచ్ ల పోరం మండల అధ్యక్షుడు కాశీరెడ్డి బస్కర్ రెడ్డి,సర్పంచ్ కనుక నాగేష్, నాయకులు గడ్డం శంకర్ రెడ్డి,తలరి అనంద్, లింగపెళ్ళి గంగాధర్, నల్ల రామరాజు,వెల్పుల శ్రీనివాస్,నల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పిన పెను ప్రమాదం....!

**-రైలు వచ్చే సమయంలో గేటు వెయ్యని సిబ్బంది**
**-గేట్ కిపర్ నిర్లక్ష్యం గుర్తించి సస్పెండ్ చేసిన రైల్వే ఉన్నత అధికారులు**
**-రైలు గేట్ వద్ద జువ్వాడి నర్సింగరావు పరిశీలన**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (10) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని అమ్మకపెట్ గ్రామ శివారులో రైల్వే గేట్ వద్ద రైల్వే గేటు వద్ద పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం య10 :20 సమయం లో నిజామాబాద్ నుండి రామగుండం వస్తున్న గుడ్స్ రైలు వచ్చె సమాయంలో సిబ్బంది రైలు గెటు వేయకపోవటంతో అప్రమత్తం అయిన పెలైట్ గేట్ ప్రాతం ముందే రైలు అపేశాడు.ఈమేరకు సంబదిత గేట్ కిపర్‌ను అగ్రహించి ఉన్నత అదికారుల కు సమాచారం అందించారు. మంగళవారం కోరుట్ల నియెజికవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు రైల్వే గేట్ ను పరిశీలించారు.గేట్ వేయని సమాచారంను తెలుసుకున్నారు.గేట్ కిపర్‌ను రైల్వే ఉన్నత అదికారులు సస్పెండ్ చేశరని,విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని నర్సిగరావు పెర్కొన్నారు.అక్కడ ప్రయాణికులతో సమస్యలు తెలుసుకున్నారు.రైల్వే గేట్ వద్ద గత కోంత కాలంగా తరుచు గేట్ పడటం 30 నిమిషాలు ప్రయాణికులు నిరిక్షించటం తప్పటం లేదు.గేట్ పడితే అప్రోచ్ రహదారిపైనుండి ప్రయాణం ఇబ్బంది అవుతోదని రహదారినీ శుభ్రం చేసి ప్రయాణానికిఅనువుగా మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# పాండిత్యానికి ప్రతి రూపం విద్వన్మణి రాజన్నశాస్త్రి

**-మార్చి 11... రాజన్న శాస్త్రి వర్ధంతి**



**రామ కిష్టయ్య సంగన భట్ల...**

నిరంతర పఠన మందే మనసును లగ్నం చేసి,సిద్ధి పొందిన సాహితీ తాపసి కొరిడె రాజన్న శాస్త్రి.కావ్య వ్యాఖ్యల్లో మల్లినాథసూరి వలె, శాస్త్ర వ్యాఖ్యలలో అభినవ గుప్తుని వలె, శ్లేష రచనలో శ్రీహర్షుని వలె, కమనీయ కవితలో కాళిదాసు వలె వచన రచనలో దండి వలె,ప్రసంగాలలో కవిసామ్రాట్ వలె భాసించిన బహుముఖ ప్రజ్ఞాశాలి రాజన్న శాస్త్రి, వేద వేదాంగ శాస్త్ర ఆగమ సకల కళలకు కాణాచి అయిన ధర్మపురి క్షేత్రంలో 1933 జూన్2న జన్మించిన శాస్త్రి.ఇంటి వద్ద వేద సంస్కృత అధ్యయనాలు చేసి, మహారాష్ట్ర, గుజరాత్, ఇతర ప్రాంతాలలో లబ్ద ప్రతిష్టులైన తాడూరి బాలకృష్ణ శాస్త్రి వద్ద కావ్య పాఠాలు, పాలెపు వేంకటరాయ శాస్త్రి చెంత, అద్వైత పూర్వ మీమాంసాదులను అభ్యసించారు. సంస్కృతాంధ్రాలలో ప్రైవేటుగా పరీక్షలు రాసి ఉపాధ్యాయ, అధ్యాపక స్థాయి నుండి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్య స్థాయికి, స్వయం కృషితో చేరుకున్నారు.

మనోహర కవితాధారలను స్రవించడమే కాకుండా,అమర భాషలు శ్లేషలో రెండర్థాలతో "బలి పుష్ట విలసితం"అనే పేరుతో కాకి,రాజకీయ నేతక్షుద్రవ్యంలో సమానులే అనే భావం ప్రకటితమ య్యేలా,ఆయన ద్వర్తి లఘు రచన సమస్త భారతావనిలో అభిమాన పాత్రతకు కారణమైంది.అలాగే, "గణ నాయక స్తవం" పేరుతో రచన... పైకి గణపతి ప్రార్థన, తరచి చూడ,లోన నాయకుల ప్రస్తావన ఇమిడించుకుంది. "మధుపవి గీతి"లో తేనెను త్రాగుతున్న తుమ్మెదను వర్ణిస్తూ త్రాగుబోతు దుశ్చర్య లను శ్లేషార్థంతో విరచించారు. హరి హర స్తుతి మరో శ్లేష కావ్యం. చలన చిత్రాలు కళ,విజ్ఞానం అందించాల్సిన సాధనాలుగా ఉండాలని,కానీ అది హింస,అశ్లీలతతో కూడి ఉంటున్నాయని ఆవేదన భరిత సామాజిక బాధ్యతలు వ్యక్తీకరించారు. అలంకార శాస్త్ర గ్రంథం పరిష్కారమే కాకుండా,అల్లసాని పెద్దనామాత్యుని "మను చరిత్ర"లోని ధ్వని సిద్ధాంత అనువర్తనాన్ని పరిశోధన గ్రంథ రూపంలో వెలువరించి, ప్రతిభను చాటి చెప్పి,డాక్టరేట్ పొందారు. చిన్నయ సూరి బాలవ్యాకరణానికి వ్యాఖ్యానం రాశారు.దివాకర్ల సాహితి ట్రస్టు నుండి పురస్కార గ్రహీతలు అయినారు. హైదరాబాద్ సంస్కృత భాషా ప్రచార సమితికి "వైస్ ఛాన్సలర్"గా పనిచేసి సంస్కృత భాషామ తల్లికి నీరాజనాలు అందించే కృషి జరిపారు. దివాకర్ల పండిత మండలిలో "భువన విజయం' భారతా వరణం,శ్రీనాధ కనకాభిషేకాది రూపకాలలో విభిన్న పాత్రలు ధరించి జీవం పోశారు.తాము పుట్టువు నొంది, పెరిగిన ధర్మపురి క్షేత్రం శ్రీలక్ష్మీ నరసింహుని సుప్రభాత శ్లోకాలు,నిత్య ఉషోదయ ప్రతిధ్వనులు గా,కొనసాగు తూ వస్తున్నాయి.భర్తృహరి శతక త్రయంకు సంబంధించి చతుర్థ శతకం పేరున,1987లో "ఓరియంటల్ కాన్ఫరెన్స్"లో నూతన ఆవిష్కరణలు గావించి,విశేషాలను వివరించారు. "వసుమతీ వసుధాకరం"పేరుతో రాసిన సంస్కృత నాటకం, నాలుగు దశాబ్దాల నాటి సంస్కరణలపై వెలుగొంది ఆకాశవాణి కేంద్రం ద్వారా ప్రసారమై, సంస్కృత భారతిలో ప్రచురితమైంది. "వింశతి శతాబ్దీయ సంస్కృత కావ్యామృతం"లో భారత.దేశ వాసులకు సుపరిచితులైన,20మంది మహాకవుల సరసన స్థానాన్ని పొందారు.షోడశ్రీ అనే 16 మంది భారతీయ సంస్కృత కవుల పరిచయంలో,రాజన్న శాస్త్రి కవిత్వం ముద్రితంగా నిలిచింది."నిబంధ రత్న సముచ్చయము",సరస్వత సుషమం, సూర్యోదయం,సాగరికా,సంవిద్, అమృతలతా,సంస్కృత శోధనా, సంస్కృత భారతి, మధురవాణి లాంటి అనేక పత్రికలలో వచ్చిన తమ రచనలను సంకలనం గావించారు.3,500 శ్లోకాల తో కూడిన "ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం" క్రీస్తుశకం 930 నాటి,ప్రాచీన తాళపత్ర గ్రంథాల్ని, స్థానికులు పండితులు కశోజ్జల సదాశివ శాస్త్రికి సహకరించి, పరిష్కరించి, దేవస్థానానికి ప్రచురణార్థం అందజేశారు.లక్ష్మీనరసింహ సుప్రభాతం , ప్రపత్తి, కాళేశ్వర స్తుతి, హరిహర స్తుతి లాంటి దేవత స్తుతులతో తమ కవిత మాధుర్యాన్ని రంగరించారు. తమ పాండిత్య ప్రతిభతో యావత్ దేశానికి బహుముఖీన సాహిత్య సేవలందించి, తెలంగాణ పూర్వ పండిత సంప్రదాయ వారసునిగా, ప్రతినిధిగా నిలిచిన కొరిడె రాజన్న శాస్త్రి, 2013 మార్చి 11న పాంచభౌతిక శరీరాన్ని త్యజించి, పర బ్రహ్మలీనులైనారు.

## జువ్వాడి నర్సింగరావును సన్మానించిన లింబద్రి



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం మార్చి (10) :** జగిత్యాల జిల్లా మెట్ పల్లి,కోరుట్ల పటణలలో కాంగ్రెస్‌పార్టీ రెండు మున్సిపాలిటీలు కైవసం చేసుకోవడం పట్ల అభినందిస్తూ మంగళవారం కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావును కాంగ్రెస్ మాజీ డిసిసి కార్యదర్శి,ఇబ్రహింపట్నం మండల నాయకులు పెంట లింట లింబద్రి శాలువాతో సన్మానించిశుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**-ముఖ్య అతిథులుగా జువ్వాడి బ్రదర్స్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల,మార్చి,10 :** కోరుట్ల పట్టణంలోని కింగ్స్ గార్డెన్ లో పట్టణ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు,కాంగ్రెస్‌పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు హాజరయ్యారు.ఈ సందర్భంగా జువ్వాడి బ్రదర్స్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజల అభివృద్ధి సంక్షేమంకోసం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంకృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ మహమ్మద్ షాహేద్ ఉల్ అహ్మద్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం,కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌పన్నాల అంజిరెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎంఏ నయీమ్, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో మహిళల పాత్ర కీలకం



**చురకలు విలేకరి, జగిత్యాల,మార్చి 10 :** సమాజంలో మహిళల పాత్ర కీలకమని,నేడు పురోగమిస్తున్న శాస్త్ర సాంకేతిక రంగాలలో మహిళల ప్రాధాన్యత పెరిగిందని ఇది శుభ పరిణామమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు.ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ఉపన్యాస మరియు వ్యాస రచన పోటీలు నిర్వహించారు.ముఖ్య అతిథిగా చైల్డ్‌మ్యారేజ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ భూమేశ్ హాజరయ్యారు.మహిళలు అన్నిరంగాలలో ముందుండాలని సమాజంలో మహిళా పాత్ర ఎంతో ముఖ్యం ఓవ్యక్తి జీవితంలో స్త్రీ చాలా పాత్రలు పోషిస్తుందన్నారు. మగవారికి సమానంగా టీచర్, ఇంజనీర్, పైలెట్ వంటి బాధ్యతలను కూడా ఆమె స్వీకరించి వందశాతం వాటికి న్యాయం చేస్తుంది.నేటి కాలంలో స్త్రీలు సాధించిన విజయాలు నిజంగా ఆకాశాన్నంటాయి. ఉపన్యాస వ్యాసరచనపోటీలో గెలుపొందిన వారికీ బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రొఫెసర్ వరప్రసాద్, నీరజ, మల్లికార్జున్ డా.జమున,సునీత,న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.చంద్రయ్య,అధ్యాపకులు డా.శ్రీలత టీంసభ్యులు లత, శ్యామల పాల్గొన్నారు.

# పరీక్షల కేంద్రానికి 9:30 గంటలలోగా విద్యార్థులు చేరుకోవాలి

**-ఐదు నిమిషాల ఆలస్యమైన అనుమతించరు**
**-ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏ,బి రెండు పరీక్ష కేంద్రాల ఏర్పాటు**
**పదో తరగతి పరీక్ష రాస్తున్న 557 మంది విద్యార్థులు**
**-ఎల్లారెడ్డిపేట మండల విద్యాధికారి కృష్ణ హరి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 10 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ బి రెండు పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎల్లారెడ్డిపేట మండల విద్యాధికారి కృష్ణ హరి ప్రకటించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని 10 ప్రభుత్వ ప్రైవేట్ ఉన్నత పాఠశాలలకు చెందిన 557 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజర్ కానున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 14వతేదీ నుండి మార్చి 16వతేదీ వరకు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షల సమయాన్ని కేటాయించినట్లు విద్యార్థులు పరీక్షల కేంద్రానికి 9:30 గంటలలోగా చేరుకోవాలని ఐదు నిమిషాల ఆలస్యమైన అనుమతిలేదన్నారు. పదవ తరగతి ఏ సెంటర్ సూపరింటెండెంట్‌గా రవీందర్ డిపార్ట్మెంట్ ఆఫీసర్గా రాజేశ్వరి బి సెంటర్ సూపరింటెండెంట్‌గా ఏ రవీందర్ రెడ్డి డిపార్ట్మెంట్ ఆఫీసర్గా పి వెంకట్రాంరెడ్డిని రెండు పదోతరగతి పరీక్ష కేంద్రాలకు 28మందిని ఇన్విజిలెటర్లుగా నియమించినట్లు ఆయన చెప్పారు. అల్మాస్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,కస్తూరిబా ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థులు వీర్నపల్లి పదోతరగతి పరీక్షల కేంద్రంలో పరీక్షలు రాయవలసి ఉంటుందన్నారు.

# ఎల్లమ్మ కొలుపుకు సిద్ధమైన ఆలయం

**-ఈనెల 13 నుండి 15 వరకు ఉత్సవాలు**
**-ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు**










**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 10 :** కమాన్ పూర్ మండలం పెంచికలపేట గ్రామంలో గౌడ కులస్తుల అరాధ్య దైవం అయిన ఎల్లమ్మ తల్లి ప్రతిష్టాపనకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ నిర్వహకులు గౌడ కులస్తులు తెలియజేశారు. ఈనెల 13న శుక్రవారం రోజు నుండి మొదలుకొని ఆదివారం వరకు ప్రతిష్టాపన కార్యక్రమాలు మూడు రోజులపాటు నిర్వహించిన జరుగుతుందని తెలిపారు. ముందుగా13 నా గ్రామదేవతలైన పోచమ్మ మైసమ్మ నల్ల పోచమ్మ భూదేవి ల వద్ద పూజలు భారీ ఎత్తున గ్రామస్తులు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా యాగ ప్రవేశం శ్రీ మహా గణాధిపతి పూజ,స్వస్తి పుణ్యా వచనము ,దీక్ష కంకణా ధారణలు,అఖండ ప్రతిష్ట, అంకురార్పణం,దశ దిగ్బంధన, సర్వతోభద్ర మండల ఆరాధన, స్తంభ పూజ, నవగ్రహ అష్టాధి దీపాలన,అగ్ని ప్రతిష్ట హోమము,యంత్ర పూజలు, మహా నివేదిత,మంత్రపుష్పం,తీర్థ ప్రసాద వితరణ, నిర్వహిస్తారు. 14 తేదీ రోజున సుప్రభాతం వేద పారాయణం మహా రుద్ర హోమం,దుర్గ,శ్రీ సూక్త, శ్రీ రేణుక దేవి,మూల మంత్ర హోమాలు నిర్వహిస్తారు. మహిళలచే ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం ఏడుగంటలకు విగ్రహమూర్తుల యాగశాల ప్రవేశం, ధాన్య దివాసం,మూర్తి హోమం, అంగవైకల్య హోమం,ఫల,పుష్ప,ధన షాయాదివాసం అష్టదిగ్బంధన నివేదన మంత్రపుష్పం తీర్థ ప్రసాద వితరణ బలిహరణలు నిర్వహిస్తారు. 15వ తేదీన ఉదయం 7:30 నుండి ప్రతిష్టాపన సుమోహూర్తాన యంత్ర స్థాపన మరియు ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, కళావాహనం, హోమం,దృష్టి స్థాపన,అగ్ని ప్రజ్వలన, కుంభదేను దర్శనం,నీరాజనం పంచ వీరపట్టణం హోమాలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. అనంతరం భక్తులచే అమ్మవారి దర్శనం ఉంటుంది. ప్రతిరోజు హోమము పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆసక్తి కలవారు ఆలయ కమిటీ సంప్రదించాలని కోరారు. అన్నదాన కార్యక్రమం చివరి రోజున నిర్వహించడం జరుగుతుంది. కావున భక్తులు భారీ ఎత్తున హాజరై ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.

# మహిళల శ్రేయస్సుకే షీ టీమ్‌లు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 10 :** మహిళల శ్రేయస్సుకే షీ టీంలు పనిచేస్తున్నాయని షీటీం ఇన్చార్జ్ స్నేహలత అన్నారు. రామ గుండం సి.పి ఆదేశాల మేరకు,షీటీమ్ ఇంచార్జి ఎస్సైలావణ్య అధ్యర్యంలో గోదావరిఖని లోని సింగరేణి ఏరియా హాస్పిటల్ లొ స్టాఫ్ కీ షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్, లిసైబర్ క్రైమ్స్ పై అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని,ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయ పడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని మరియు తల్లిదండ్రులు పిల్లలతో ఎలా ఉండాలని, మరియు వర్క్ ప్లేస్ లొ ఏమైన ఇబ్బందులు ఎదురైతే షీ టీమ్ కి చెప్పాలి అని తెలిపారు. ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్ మరియు ,డి వై సి ఎం. డాక్టర్ :ప్రసన్న కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జీదుల శ్రీనివాస్,సీనియర్ స్టాఫ్ నర్సెస్,మ్యాట్రన్ నిర్మల కుమారి,శశికల్, సినియర్ అసిస్టెంట్,సి హెచ్. సమత.ఆసుపత్రి మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలి

**-సీఐ వెంకటేష్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మార్చి 10 :** ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని మూడు మండలాల ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులకు సహకరించాలని సీఐ వెంకటేష్ ప్రజలను కోరారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతున్న నూతన టెక్నాలజీని అందిపుచ్చు కుశీటూనే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏదేని ఫ్రాడ్ జరిగినట్లుగా గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని,గంజాయి,డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో పోలీసులకు ప్రజలు సహకరించాలనీ,పోలీసులు ప్రజల భాగస్వామ్యంతో సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు శాంతి భద్రతల కొరకై నిరంతరం శ్రమిస్తూనే ఉంటారని సీఐ సర్కిల్ పరిధిలోని ప్రజలకు సూచించారు.

## రైతులకు వరి సీడ్ సాగుపై అవగాహన



**చురకలు విలేఖరి వీణవంక మార్చి 10 :** వీణవంక మండల కేంద్రంలో మంగళవారం బాయర్ కంపెనీ బికోట వయాగో క్షేత్ర స్థాయి ప్రదర్శన నిర్వహించారు. రైతు మోటం రాజుకు చెందిన మేల్ ఫీమేల్ వరి పైరులో నాటిన15 రోజుల్లో బికోట వేయడం వయాగో నాటిన 35రోజులలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. బికోట,వయాగో వాడిన పొలంలో మొగిపురుగు లేకుండా ఉండటం, బలమైన వేరు అధిక పిలకలు,వరి పైరు ఉండటాన్ని రైతులకు వివరించారు. బాయర్ కంపెనీ ప్రతినిధులు జీవన్,మాడ శ్రీకాంత్ రెడ్డి,తిరుపతి25 మంది రైతులు పాల్గొన్నారు.

## తొట్ల తిరుపతి యాదవ్ చొరవతో సమస్యకు పరిష్కారం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మార్చి 10 :** రామగిరి మండలం పన్నూర్ గ్రామంలోని జేఎన్టీయూహెచ్ ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేస్తున్న స్వీపింగ్ కార్మికుల సమస్యకు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ పరిష్కారం చేశారు. గత కొద్ది సంవత్సరాలుగా కనీస వేతనం పెరగకపోవడంతో ఆ సమస్యను మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ఆయన తెలంగాణ రాష్ట్ర ఐటీ ఢ పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు సూచనతో వెంటనే చర్యలు తీసుకున్నారు. అనంతరం మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ సంబంధిత అధికారులతో మాట్లాడి జేఎన్టీయూ యూనివర్సిటీ వద్ద సమస్యను పరిష్కరించేలా చొరవ చూపారు. దీంతో గత కొద్ది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనం పెంపును అమలు చేయడంతో పాటు బకాయిలను కూడా ఇప్పించారు. ఈ సందర్భంగా బాధితులు ఈ రోజు మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, తమ సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతగా తొట్ల తిరుపతి యాదవ్ ని శాలువాతో సత్కరించి, స్వీట్లు తినిపించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# చిన్న పత్రికలను చిదిమేయకండి

**-ప్రభుత్వ ప్రకటనల బిల్లులు వెంటనే చెల్లించాలి**
**-ఐఅండ్ పీఆర్ కమీషనర్ కు టీడబ్ల్యూజేఎఫ్ నేత మామిడి సోమయ్య విజ్ఞప్తి**



**చురకలు ప్రతినిధి, హైదరాబాద్, మార్చి10 :** రాష్ట్రంలోని చిన్న, మధ్యతరహా పత్రికలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, ఈ ధోరణి సరైంది కాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లుగా చిన్న,మధ్య తరహా పత్రికలు అనేక సమస్యలను ఎదు ర్కొంటున్నాయని అన్నారు.చిన్న మధ్య తరహా పత్రికలకు,పీరియాడికల్స్ కు రాష్ట్ర ప్రభుత్వం సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ఇచ్చిన ప్రకటనలకు సంబంధించిన బిల్లుల బకాయిలను ఇంతవరకు చెల్లించకుండా జాప్యం చేస్తున్నదని ఆయన ధ్వజ మెత్తారు.ఒకవైపు అడ్వర్టైజ్మెంట్లు సక్రమంగా ఇవ్వకుండా,మరోవైపు ఇచ్చిన అడ్వర్టైజ్మెంట్లకు బిల్లులు ఇవ్వకుండా జర్నలిస్టులను, పత్రికల నిర్వహకులను ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు.ప్రభుత్వ అణిచివేత ధోరణి వల్ల పత్రికల ప్రచురణకర్తలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదు ర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పత్రికల ప్రకటనల కోసం బడ్జెట్ ఉన్నప్పటికీ పిరియాడికల్స్,చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వం అరకొర నిధులు కేటాయిస్తుందని, అయినప్పటికీ రాష్ట్రఆర్థికశాఖ అధికారులు కేవలం కొన్ని పెద్ద పత్రికలకు,యాడ్ ఎజెన్సీలకు మాత్రమే పెద్ద పీట వేసి సకాలంలో వాటికి బిల్లులు చెల్లిస్తూ, చిన్న మధ్య తరహా పత్రికలకు పెండింగ్ పెడుతున్నారని ఆరోపించారు.పైగా గత కొన్ని నెలలుగా పిరియాడికల్స్‌కు ప్రభుత్వం ఇచ్చే ప్రకటలు పూర్తిగా నిలిపివేశారని అన్నారు.చిన్న,మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్‌కు ప్రభుత్వ నుండి రావాల్సిన అడ్వర్టైజ్మెంట్స్ బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు.అదే విధంగా రెగ్యులారిటీ ఉన్న చిన్న, మధ్యతరహా దినపత్రికలు, పీరియాడికల్స్‌ను ఎంపానల్మెంట్ చేయాలని,చిన్న పత్రికలకు పెద్ద పత్రికలతో సమానంగా ప్రభుత్వ ప్రకటనలు రెగ్యులర్‌గా విడుదల చేయాలని,అడ్వర్టైజ్మెంట్స్‌కు ఇవ్వాల్సిన బిల్లులను సకాలంలో విడుదల చేయాలని కోరారు.కాగా చిన్న,మధ్య తరహా పత్రికల పెండింగ్ బిల్స్ విషయమై మామిడి సోమయ్య మంగళవారం రాష్ట్ర సమాచార,పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంకతో ఫోన్లో మాట్లాడారు.బిల్స్‌రాక చాలా మంది పత్రికల నిర్వహకులు ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే బిల్స్ చెల్లించాలని ఆయన కమీషనర్ ను కోరారు. పెండింగ్ బిల్స్ విడుదల చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ చెప్పారని మామిడి సోమయ్య తెలిపారు.

## పట్టణ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**-ముఖ్య అతిథులుగా జువ్వాడి బ్రదర్స్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల,మార్చి,10 :** కోరుట్ల పట్టణంలోని కింగ్స్ గార్డెన్‌లో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు హాజరయ్యారు.ఈ సందర్భంగా జువ్వాడి బ్రదర్స్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ మహమ్మద్ షాహేద్ ఉల్ అహ్మద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎంఏ నయీమ్, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# శృంగేరి పీఠానికి సమర్పించి సరిచూసిన తరువాతే పంచాంగ ముద్రణ

**- డా. టి. అరుణ్ కుమార్ 25వ సంవత్సరంగా కొనసాగుతున్న పంచాంగ ప్రచురణ సంప్రదాయం**

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**



వేద సంప్రదాయంలో కాలగణనకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. కాలం అనేది కేవలం రోజులు, నెలలు, సంవత్సరాల లెక్క మాత్రమే కాదు; జీవన విధానాన్ని, ధార్మికాచరణలను, యజ్ఞ యాగాదులను, పండుగల నిర్వహణను సక్రమంగా నియంత్రించే దివ్యమైన పద్ధతి. వేదాలలో చెప్పబడిన కర్మలను ఎప్పుడు ఆచరించాలి, ఏ తిథిలో ఏ పూజ చేయాలి, ఏ నక్షత్రంలో ఏ శుభకార్యం చేయడం శ్రేయస్కరం అనే విషయాలను స్పష్టంగా తెలియ జేసేది పంచాంగం. అందుకే భారతీయ జ్ఞాన సంప్రదాయంలో “వేదానాం జ్యోతిషం చక్షుః” అనే వాక్యం ప్రసిద్ధి చెందింది. వేదాలకు జ్యోతిషశాస్త్రం కన్నులాంటిదని అర్థం. కాలగణనను సరిగ్గా నిర్ధారించి ధర్మాచరణకు మార్గదర్శనం చేయడం పంచాంగం యొక్క ప్రధాన కర్తవ్యంగా భావించ బడింది.ఈ వేద సంప్రదాయాన్ని ప్రజలలో విస్తరింప జేయాలనే లక్ష్యంతో ధర్మపురిలోని శ్రీ గాయత్రి బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రంలో నూతన పంచాంగ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించ బడింది. పరాభవ నామ సంవత్సరానికి సంబంధించిన పంచాంగాన్ని భక్తులకు, పండితులకు, ప్రజలకు అందజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా నిలిచింది. సత్రాధ్యక్షులు కొరిడె దత్తాత్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని కార్యదర్శి బండయ్య సమన్వయం, ఇందారపు రామయ్య సహకారం చేశారు. సత్రం వేదికగా నిర్వహించిన ఈ పంచాంగ వితరణ కార్యక్రమం ధార్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధల మధ్య సాగింది.పంచాంగం భారతీయ సంస్కృతిలో కేవలం క్యాలెండర్ కాదు. ఇది ఖగోళ శాస్త్రం, జ్యోతిష శాస్త్రం, వేద సంప్రదాయం, పురాణ సంప్రదాయం వంటి అనేక జ్ఞానశాఖల సమన్వయంగా రూపుదిద్దుకున్న గ్రంథం. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణ అనే ఐదు అంశాల సమాహారమే పంచాంగం. ఈ ఐదు అంశాలు కలిపే కాల గణనను పంచాంగం ద్వారా నిర్ణయిస్తారు. పండుగలు, వ్రతాలు, ఉపవాసాలు, యజ్ఞాలు, గృహ ప్రవేశాలు, వివాహాలు వంటి శుభ కార్యాలన్నీ పంచాంగ సూచనల ఆధారంగానే నిర్ణయించ బడతాయి. అందువల్ల పంచాంగాన్ని ధర్మాచరణకు మార్గదర్శక గ్రంథంగా భావిస్తారు.ఈ సందర్భంలో పంచాంగ వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులకు సిద్ధాంతి అరుణ్ కుమార్ పంచాంగ ప్రాముఖ్యతను వివరించారు. లక్ష్మీ గణపతి మహా ఆలయం, బోర్గాం, నిజామాబాద్ వ్యవస్థాపకులు, నిర్మాత, ప్రముఖ జ్యోతిష పండితులు, పంచాంగకర్త డాక్టర్ టి. అరుణ్ కుమార్ మాట్లాడుతూ... పంచాంగ నిర్మాణం వెనుక ఉన్న శాస్త్రీయ విధానాన్ని వివరించారు. పంచాంగ పంచాంగ కర్తృత్వం లేదా గణన అనేది సాధారణ ప్రక్రియ కాదని, దీనికి ఖగోళ గణనలు, గ్రహస్థితుల పరిశీలన, తిథి నక్షత్రాల లెక్కలు, సూర్య చంద్రుల గమన విశ్లేషణ వంటి అనేక శాస్త్రీయ విధానాలు అవసర మవుతాయని ఆయన తెలిపారు. ఖగోళ గణనలను అత్యంత జాగ్రత్తగా పరిశీలించి, సంప్రదాయ పద్ధతులను అనుసరించి పంచాంగాన్ని రూపొందిస్తామని చెప్పారు.పంచాంగం ఖచ్చితత్వం కోసం ప్రతి సంవత్సరం పండితుల సలహాలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా శృంగేరి పీఠానికి సమర్పించి అక్కడి పండితుల సూచనలు, సవరణలు పొందిన తర్వాతే పంచాంగాన్ని ముద్రణకు పంపుతామని వివరించారు. ఈ విధంగా సంప్రదాయం, శాస్త్రం రెండింటినీ సమన్వయం చేస్తూ పంచాంగాన్ని రూపొందించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. దీనివల్ల పంచాంగం ఖచ్చితత్వం మరియు విశ్వసనీయత పెరుగుతుందని చెప్పారు.ఈ పంచాంగం ప్రచురణకు ఇరవై ఐదు సంవత్సరాల చరిత్ర ఉందని డాక్టర్ అరుణ్ కుమార్ తెలిపారు. గత ఇరవై ఐదు సంవత్సరాలుగా నిరంతరంగా పంచాంగాన్ని ప్రచురిస్తూ ప్రజలకు అందించడం తమకు ఒక ధార్మిక సేవగా భావిస్తున్నామని చెప్పారు. ప్రతి సంవత్సరం కొత్త సంవత్సరానికి సంబంధించిన పంచాంగాన్ని మరింత మెరుగైన సమాచారంతో రూపొందించి భక్తులకు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ పంచాంగంలో తిథులు, నక్షత్రాలు మాత్రమే కాకుండా పండుగల వివరాలు, వ్రతాల ప్రాముఖ్యత, శుభ ముహూర్తాలు వంటి అనేక విషయాలను సమగ్రంగా పొందు పరుస్తామని వివరించారు.పంచాంగ వితరణ కార్యక్రమంలో డాక్టర్ టి. అరుణ్ కుమార్ మరియు నాగరాణి దంపతులు భక్తులకు పంచాంగ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు పంచాంగాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. సత్రంలో జరిగిన ఈ కార్యక్రమం ధార్మిక ఉత్సాహాన్ని ప్రతిబింబించింది. పంచాంగం ద్వారా ప్రజలు ధర్మాచరణలో మరింత అవగాహన పొందాలని కార్యక్రమ నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.విశ్రాంత విద్యాధికారి శంకర్ కొరిడె మాట్లాడుతూ పంచాంగకర్త డాక్టర్ అరుణ్ కుమార్ సేవలను వివరించారు. జ్యోతిషశాస్త్రంలో అరుణ్ కుమార్ కు ఉన్న పాండిత్యం, పంచాంగ నిర్మాణంలో చూపుతున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక సమాజానికి చేరవేయడంలో ఆయన చేస్తున్న సేవలు విశేషమైనవని పేర్కొన్నారు. పంచాంగం తయారీ అనేది కేవలం గణిత లెక్కల సమాహారం మాత్రమే కాకుండా సంప్రదాయ పాండిత్యం, శాస్త్రీయ దృష్టి, అనుభవం కలిసిన ప్రక్రియ అని తెలిపారు.ధర్మపురి ప్రాంతంలో బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం నిర్వహిస్తున్న సేవలు కూడా ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చాయి. ఈ సత్రం ద్వారా ప్రతిరోజూ అన్నదానం నిర్వహించడం మాత్రమే కాకుండా ధార్మిక కార్యక్రమాలు, పండిత సదస్సులు, పుస్తక వితరణ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. ఈ సత్రం ప్రాంతీయ ధార్మిక కేంద్రంగా నిలుస్తోంది. పంచాంగ వితరణ వంటి కార్యక్రమాలు ప్రజల్లో ధార్మిక అవగాహన పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి.పంచాంగం భారతీయ సంస్కృతిలో కాలాన్ని మాత్రమే సూచించదు. అది జీవన విధానానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. ఉదయం సూర్యోదయం నుంచి రాత్రి నిద్రించే వరకు మన జీవన క్రమంలో అనేక అంశాలు పంచాంగంతో సంబంధం కలిగి ఉంటాయి. ముఖ్యంగా వ్యవసాయం, వృత్తులు, పండుగలు, వ్రతాలు, యాత్రలు వంటి అనేక అంశాలు పంచాంగ సూచనల ఆధారంగానే నిర్వహించ బడతాయి. అందువల్ల పంచాంగం భారతీయ సంస్కృతిలో ఒక జీవంతమైన సంప్రదాయంగా నిలిచింది.ఈ నేపథ్యంలో ధర్మపురిలో జరిగిన పంచాంగ వితరణ కార్యక్రమం సంప్రదాయం మరియు భక్తి భావాన్ని ప్రతిబింబించింది. పంచాంగం ద్వారా వేద సంప్రదాయం ప్రజల్లో నిలిచి ఉండాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆకాంక్షించారు. పంచాంగం కేవలం పుస్తకం మాత్రమే కాదు; అది కాలాన్ని అర్థం చేసుకునే ఒక జ్ఞాన మార్గదర్శి అని ఈ కార్యక్రమం మరోసారి స్పష్టం చేసింది.పాలకవర్గ సభ్యులు, భక్తులు, పండితులు పాల్గొన్న ఈ కార్యక్రమం ధార్మిక ఉత్సాహంతో ముగిసింది. 2025-26 సంబంధిత పరాభవ నామ సంవత్సరానికి సంబంధించిన పంచాంగాన్ని ప్రజలకు అందించడం ద్వారా ధర్మాచరణకు మార్గదర్శనం చేయాలనే లక్ష్యం నెరవేరింది. వేదసంప్రదాయం, జ్యోతిషశాస్త్రం, కాలగణన అనే మూడు అంశాల సమన్వయంగా పంచాంగం భారతీయ సంస్కృతిలో చిరస్థాయిగా నిలిచే జ్ఞాన సంపదగా కొనసాగుతోంది.

# 99 రోజుల యాక్షన్ ప్లాన్ పచ్చి మోసం

**-కాలయాపన కోసమే ఈ ప్రణాళిక**
**-ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు ఏమైంది..?**
**-మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,మార్చి 10 :** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ పచ్చి మోసమని,ఈ ప్రణాళిక కాలయాపన కోసమే తీసుకవచ్చిందని,ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు ఏమైయయ్యాని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. మంగళవారం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగిత్యాలలో జెండా,ఏజెండాలేని రాజకీయాలు నడుస్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రచార ఆర్భాటాలతో పబ్బం గడుపుతుందన్నారు.ప్రగతి ప్రణాళిక పేరుతో కాంగ్రెస్‌ప్రభుత్వం కాలయాపనా చేసే ప్రయత్నం చేస్తుందని, మరోసారి ప్రజలను మోసం చేసే కుట్ర చేస్తుందన్నారు.కాంగ్రెస్ ముసుగులో టిడిపి పాలనా రాష్ట్రంలో సాగుతుందని, క్షేత్రస్థాయి వరకు జెండా,ఎజెండా లేకుండా ఇష్టరీతినపాలన సాగిస్తున్నారని,కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కి రెండున్నరేళ్లు పూర్తయిందని, ఆరు గ్యారంటీలు,420హామీల అమలు ఏమయ్యాయని,అబద్దాలు ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చి ప్రజా పాలన అని దరఖాస్తులు తీసుకొని సాధించింది ఏమటని ప్రశ్నించారు.జగిత్యాల జిల్లాలో ప్రజాపాలన రెండు లక్షల దరఖాస్తులు ఏమయ్యాయని,ప్రచార ఆర్భాటం తప్ప, కాంగ్రెస్ పథకాలతో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు.గతంలో మాజీ సీఎం కేసిఆర్ పల్లె,పట్టణ ప్రగతి పేరుతో మౌలిక వసతుల కల్పనా ధ్యేయంగా ముందుకు సాగారని,ప్రతి నెల ప్రణాళిక అమలుకు కోట్ల రూపాయలు నిధులు కేటాయించారని గుర్తు చేశారు.డబ్బులు లెకుండా 99 రోజుల ప్రణాళికతో ఉపయోగం ఏమటని,రాజీవ్ యువ వికాసం పేరిట 4లక్షల యువత దరఖాస్తు చేసుకున్నారన్నారు.సబ్బండ వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు.ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు ఐల్నేని వెంకటేశ్వర్ రావు,కౌన్సిలర్లు దేవేందర్ నాయక్,హరీష్,పట్టణ ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు,అర్బన్ మండల అధ్యక్షుడు తుమ్మ గంగాధర్,నాయకులు శీలం ప్రవీణ్,కమలాకర్,ప్రవీణ్,హరీష్,సన్నిత్ రావు,కళ్యాణి,మానస,నవీన్,శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దు


**-జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, మార్చి 10 :**

ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ అన్నారు.మంగళవారం జగిత్యాల పట్టణంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణ లో భాగంగా మంగళవారం 47వ వార్డులో గంజ్‌నాలాలో జరుగుతున్న సిల్ట్ తొలగింపు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో రాబోవు వర్షాకాలంలో నీరు నిల్వ కాకుండా ఉండేందుకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు నాలాల శుభ్రత పనులను ప్రత్యేకంగా చేపట్టినట్లు తెలిపారు. గంజ్ నాలాలో పేరుకుపోయిన సిల్టును పూర్తిగా తొలగించి నీటిప్రవాహం సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నామని,పట్టణ ప్రజలు మురికి కాలువలలో,బహిరంగ ప్రదేశములలో చెత్త వేయవద్దని,అవే తిరిగి మురికి కాలువలలో కలుస్తూ అంతరాయం కలిగిస్తున్నాయని కావున ప్రజలు సహకరించాలని కోరారు.ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం.స్పందన,వైస్‌చైర్ పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా,శానిటరీ ఇన్స్పెక్టర్ లత,రాము,ఏఈ అనిల్, ఈఈ శ్రీకాంత్,వార్డు ఆఫీసర్ హుస్సేన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## నరసింహుని హుండీ ఆదాయం 51లక్షలు



**చురకలు విలేకరి,ధర్మపురి,మార్చి 10 :** ప్రాచీన పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహస్వామి హుండీ ఆదాయం 51లక్షల 20వేల 748 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి సంకటల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం దేవస్థాన ప్రాంగణంలో 58 రోజుల హుండీని లెక్కించగా రూ.51,20,748 నగదు, మిశ్రమ బంగారం 30 గ్రాములు, మిశ్రమ వెండి 4 కిలోల 100 గ్రాములు, విదేశి నోట్లు 17 వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ సహాయ కమీషనర్ నాయిని సుప్రియ, దేవస్థాన అధ్యక్షులు జక్కు రవీందర్, ధర్మకర్తలు బొల్లారపు పోచయ్య, గుడ్ల రవీందర్, మందుల మల్లేష్, నేదునూరి శ్రీధర్, రాపర్తి సాయికిరణ్, స్థంభంకాడి గణేష్, సంబెట తిరుపతి, వొజ్జల సౌజన్య నరేందర్,ఉప ప్రధాన అర్చకులు ఎక్స్ఆఫిషియో మెంబర్ నేరళ్ళ శ్రీనివాచార్యులు, సూపరింటెండెంట్ డి.కిరణ్, సీనియర్ అసిస్టెంట్ ఎ.శ్రీనివాస్, మాజీ దేవస్థాన ధర్మకర్తలు గునిశెట్టి రవీందర్, జక్కు దేవేంధర్, సేవకులు, ఇతరులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, దేవస్థాన అర్చకులు, సిబ్బంది. భక్తులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి



**చురకలు ప్రతినిధి,జగిత్యాల, మార్చి10 :** సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివని మాజీమున్సిపల్ చైర్పర్సన్ ఆడువాల జ్యోతిలక్ష్మణ్ అన్నారు.మంగళవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా మాజీ చైర్పర్సన్ జ్యోతి మాట్లాడుతూ మాట్లాడుతూ మహిళల విద్య,సమాన హక్కుల కోసం సావిత్రిబాయిపూలే చేసిన పోరాటం భారతదేశ సామాజిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. మహిళలు చదువు కోవడం కూడా సమాజంలో వ్యతిరేకత ఎదుర్కొన్న కాలంలో,అనేక అవమానాలు, అడ్డంకులు ఎదురైనా ఆమె వెనుదిరగకుండా మహిళల విద్యాభివృద్ధికి మార్గం చూపిందని తెలిపారు. స్త్రీల విద్యకు పునాది వేసి, సమాజంలో మహిళలకు గౌరవప్రదమైన స్థానం కల్పించేందుకు ఆమె చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.నేటి సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో ముందుకు సాగుతున్న నేపథ్యంలో సావిత్రిబాయి పూలే ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# 99రోజుల యాక్షన్‌ప్లాన్‌తో ఎంతో మేలు

**-మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల,మార్చి 10 :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్తో ఎంతో మేలు చేస్తుందని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు.మంగళవారం ఆమె మాట్లాడుతూ మార్చి 6నుంచి జూన్ 12 వరకు ఐదు దశల్లో 99 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ప్రజాపాలన లక్ష్యం నెరవేర్చే దిశగా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు.జిల్లాల వారీగా మెగా జాబ్ మేళాలు నిర్వహించి లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం యువతకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ఇందిరా మహిళాశక్తి భవనాలు ప్రారంభించడం ద్వారా మహిళలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం,నిరంతరంగా రేషన్ కార్డులు అందించడం వంటి నిర్ణయాలు సామాన్య ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తాయన్నారు.గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం 10 వారాల పాటు వారానికో విభాగంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం మంచి ముందడుగు అని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ 99 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి వేగం పెరిగి ప్రజలకు మరింత మేలు జరుగుతుందని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**చురకలు విలేకరి, జగిత్యాల,మార్చి 10 :**

జగిత్యాల జిల్లా టీఎన్జీఒల సంఘం జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శాఖలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులందరినీ ఘనంగా సన్మానించి కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వారి సంక్షేమానికి టీఎన్జీవో సంఘం చేస్తున్న కృషిఎంతో గొప్పదని కొనియాడారు.ట్రెసా జిల్లా అధ్యక్షులు యం.డి.వకీల్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు అన్నిరంగాల్లో రానించాలన్నారు.జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారత,వారి హక్కుల పరిరక్షణ ,మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు వివరిస్తూ, మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళున్నారని మహిళా ఉద్యోగులందరిని ప్రోత్సహిస్తూ వారి ప్రయోజనాల కోసం టీఎన్జీవో సంఘం ఎల్లప్పుడు పాటుపడుతుందని,రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించబడతాయని తెలుపుతూ, కార్యక్రమానికి విచ్చేసిన మహిళా ఉద్యోగులందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలలిత,టీఎన్జీవో జిల్లా నాయకులు మహమూద్,సాహెబ్ బాబు, రవిచంద్ర ,రాజేశం,సుగుణాకర్, శ్రీనివాస్, మమత,శ్రావణి,ఇంద్రజ,విజయలక్ష్మి, రాజశ్రీ,శైలజ,ఈడిఎం.మమత, సృజన్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు చంద్రయ్య,అరుణ, నారాయణ,ముజాహిద్ ఖాన్,మహిళా ఉద్యోగులు ఆమని,పద్మ,లలిత,అపర్ణ, కళ్యాణి,గంగాజమున,లత,కవిత, ప్రియదర్శిని,జయసుధ,శ్రావణి, పద్మావతి, శ్రీలక్ష్మి, శైని మాత్యు, భాగ్యలక్ష్మి, లావణ్య, లత, నీలిమ, అనురాధ, కళావతి, సురేఖ, గంగాజమున, అనిత, రాజశ్రీ, రమాదేవి, దామిని, రుక్మిణి, అనూష, స్వప్న, సరిత, పద్మావతి, స్నేహలత, మమత, షౌకతున్నిసా, సుమీరా పర్వీన్,నాదీమా,రాజమ్మ, సుజాత,సబా, ఉద్యోగులు పాల్గొన్నారు.